సాక్షి
ఆదిలాబాద్
బుధవారం ¦ 21 ¦ ఆగస్టు ¦ 2024



ఆర్టీసీకి రాఖీ కళ

రాఖీ పండుగ పురస్కరించుకుని ఆర్టీసీకి రికార్డు స్థాయి ఆదాయం సమకూరింది. ఈ సారి లక్ష్యానికి మించి ప్రయాణికులను తరలించింది. 8లో▸



ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి


మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రజాసేవ భవన్‌లో రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

పైసల్లేవ్.. పనులు చేయలేం!



నార్నూర్ మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీవోకు అందజేసిన వినతిపత్రం ప్రతి

- పంచాయతీ కార్యదర్శుల నిరసన
- నార్నూర్ మండలంలో సామూహిక సెలవులోకి..
- జీపీల్లో అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ

'బ్లీచింగ్ పౌడర్ కొనలేని పరిస్థితుల్లో పంచాయతీలున్నాయి.. తాగునీటి సరఫరా, విద్యుత్ బల్బుల కోసం మా జీతం డబ్బులతో పాటు అప్పులు చేసి ఖర్చు చేస్తున్నాం.. మా శాఖ పనులే కాకుండా ఇతర శాఖ పనులను కూడా నిర్వర్తిస్తున్నాం. వంద శాతం కష్టపడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు కించపరిచే విధంగా మాట్లాడుతున్నారు. బానిసలాగా బతకాల్సి వస్తోంది.. ఉద్యోగం అంటే విరక్తి కలుగుతోంది.. చిన్న చిన్న విషయాలకు సస్పెన్షన్‌కు గురి చేస్తున్నారు.. మానసిక ఒత్తిడికి గురవుతున్నాం. ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనలు కలుగుతున్నాయి.. పై అధికారులకు చెప్పినా స్పందన కరువైంది..' ఇది నార్నూర్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీవో స్వప్నశీలకు మంగళవారం ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్న అంశాలు. పంచాయతీల్లో పైసల్లేవ్. అలాంటప్పుడు మేం ఎలా పని చేయాలంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ఆ మండలానికి చెందిన 16 మంది కార్యదర్శులు బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు సామూహిక సెలవులోకి వెళ్తున్నామని పేర్కొన్నారు. ఇక ఈ రోజుల్లో పంచాయతీల్లో పనులెలా చేసుకుంటారో.. చేసుకోండంటూ.. ఒక విధంగా సవాల్ విసిరారు. ఇది ఒక మండలంలోనే జరిగినప్పటికీ ప్రస్తుతం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

– సాక్షి,ఆదిలాబాద్/నార్నూర్



ఈనెల 16న నార్నూర్ ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణపై ఎంపీడీవో జవహర్, ఎంపీవో స్వప్నశీలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

సస్పెన్షనే ఆజ్యం..

ఈనెల 16న కలెక్టర్ రాజర్షిషా నార్నూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలు శుభ్రం చేయాలని ఆదేశించినా చేయడం లేదని కలెక్టర్ దృష్టికి రావడంతో ఆయన ఎంపీడీవో, ఎంపీవోలను పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే రోజు సాయంత్రం కలెక్టర్ నుంచి నార్నూర్ పంచాయతీ కార్యదర్శి ఆర్.దినేష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎంపీవో స్వప్నశీలపై చార్జ్ మెమో జారీ చేశారు. తాజాగా ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవులోకి వెళ్లడం సంచలనం కలిగిస్తుంది. సంబంధంలేని విషయాల్లో ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా చిన్న, చిన్న విషయాలకు సస్పెన్షన్ చేస్తే ఎలా అని వారిప్పుడు ప్రశ్నిస్తున్నారు.

వర్కర్లకు వేతనాలు ఇవ్వకపోవడంతోనే..

ప్రధానంగా ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి వచ్చిన తర్వాత ఫిబ్రవరి నుంచి పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర నిధులు ఎస్‌ఎఫ్‌సీ 15వ ఆర్థిక సంఘం నిధులు రాకపోవడంతో మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఉందని కార్యదర్శులు పేర్కొంటున్నారు. దీంతో రోడ్లు, కాలువలు శుభ్రం చేసేందుకు కూడా వర్కర్లు ముందుకు రావడం లేదని వాపోతున్నారు. ఎన్నో పనులు చేపడుతున్నా తమకు తగిన సమయం ఇవ్వకుండా పూర్తి చేయాలనడం ఏ విధంగా సబబని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో పై అధికారులకు చెప్పినా స్పందన కనిపించడం లేదని వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో ఆదిలాబాద్ అర్బన్ మినహా మిగతా 17 మండలాల్లో 468 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2011 జనాభా ప్రకారం జీపీల్లో 5 లక్షల 53 వేల జనాభా ఉంది. గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ, కరెంటు బిల్లుల చెల్లింపు, పంచాయతీ నిర్వహణకు కొనుగోలు చేసిన ట్రాక్టర్లకు సంబంధించి రుణ చెల్లింపు, వీధి దీపాల మరమ్మతులు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయడం వంటి పనులు చేపట్టాలి. మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు చెల్లించాలి. ఇదిలా ఉంటే ఒక్కొక్క తలపై గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి గ్రాంట్‌గా రూ.1500 అందజేస్తుంది. ఈ విధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి పంచాయతీలకు రూ.కోట్ల నిధులు విడుదల అవుతాయి. అయితే ప్రస్తుతం ఈ నిధులు సక్రమంగా రాకపోవడంతోనే సమస్య ఎదురవుతుందన్న అభిప్రాయం అధికార వర్గాల్లో ఉంది. అలాగే రాష్ట్రం నుంచి కూడా దీనికంటే కొంత తక్కువ మొత్తం అందుతాయి. ప్రస్తుతం నిధులలేమి కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్కర్లకు కనీసం వేతనాలు కూడా ఇవ్వలేని దుస్థితి కనిపిస్తుంది.

ఇటీవలే రూ.6.47 కోట్లు వచ్చాయి..



ఇటీవల నిర్వహించిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమ నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి రూ.6.47 కోట్లు విడుదలయ్యాయి. వాటితోనే గ్రామాల్లో వివిధ పనులు నిర్వహిస్తున్నాం. నార్నూర్‌లో పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవులోకి వెళ్లినట్లు దృష్టికి వచ్చింది. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

– శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి

మానసికంగా, ఆర్థికంగా కుంగిపోతున్నాం



పంచాయతీ పనుల కోసం జీతం డబ్బుల్లోంచి కూడా ఖర్చు చేస్తున్నాం. అప్పులు కూడా చేయాల్సి వస్తుంది. మా డిపార్ట్‌మెంట్ పనులే కాకుండా ఇతర శాఖ పనులు కూడా ఐదేళ్లుగా చేస్తున్నాం. కొన్ని సార్లు కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాల్సి వస్తోంది. పండగలు కూడా చేసుకోలేని దుస్థితి. ఇంత చేసినా మా పనితీరుపై అధికారులు సంతృప్తిగా ఉండరు. మానసికంగా, ఆర్థికంగా కుంగుబాటుకు గురవుతున్నాం. ఈ పరిస్థితుల్లోనే సామూహికంగా అందరం సెలవుల్లోకి వెళ్తున్నాం. –మేశ్రం విజయ్, పంచాయతీ కార్యదర్శి, బాబేఝరి, నార్నూర్ మండలం

రుణమాఫీ.. ఆందోళనలు



బోథ్‌లో ధర్నాలో పాల్గొన్న నాయకులు, రైతులు

- జిల్లాలో ఆగని రైతుల నిరసనలు
- మద్దతు పలికిన బీజేపీ, బీఆర్ఎస్

సాక్షి,ఆదిలాబాద్/ఆదిలాబాద్/జైనథ్/ఇచ్చోడ/గుడిహత్నూర్/బోథ్/తాంసి: రుణమాఫీ కాలేదంటూ రైతుల ఆందోళనలు మంగళవారం కూడా కొనసాగాయి.అన్నదాతకు మద్దతుగా పలుచోట్ల బీజేపీ, బీఆర్ఎస్‌లు నిరసనలు చేపట్టాయి. మరోవైపు జిల్లాలో పోలీసు యాక్ట్ 30 అమలులో ఉన్నందున అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు చేయరాదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని పేర్కొంటున్నారు.

కొనసాగిన ఆందోళనలు..

బీజేపీ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేర్వేరు చోట్ల ఆందోళనలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మహారాష్ట్ర బ్యాంకు ఎదుట బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆధ్వర్యంలో రైతులు బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఆయన ఫోన్ చేసి, రైతుల సమస్యలు చెప్పే ప్రయత్నం చేశారు. అయితే మంత్రి అందుబాటులోకి రాలేదు. గుడిహత్నూర్ మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఇందులో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఇచ్చోడ, బోథ్, తాంసి మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జైనథ్ మండలంలోని మాకోడ ఎక్స్ రోడ్‌వద్ద రైతుల ధర్నాకు బీఆర్ఎస్ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు రోకండ్ల రమేశ్ మద్దతు పలికారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్‌చేశారు. జిల్లా కేంద్రంలో అఖిల పక్షం రైతు సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మున్నూరు కాపు సంఘ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.



మంత్రికి ఫోన్ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్



గుడిహత్నూర్‌లోని జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు, రైతులు

రైతులపై కేసులు ఎత్తివేయాలి

ఆదిలాబాద్‌టౌన్: రుణమాఫీ అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్నూర్ కాపు సంఘ భవనంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్ టే బుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు నిరసన తెలిపితే నాన్‌బెయిలెబుల్ కేసులు పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వ, పోలీసుల తీరు సరికాదన్నారు. రైతులపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇందులో అఖిల పక్ష నాయకులు బండి దత్తాత్రి, గోవర్ధన్, పోశెట్టి పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన అఖిలపక్ష నాయకులు

కైలాస్‌నగర్: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిలపక్ష నాయకులు మంగళవారం కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో వారిని వేర్వేరుగా కలిసిన నాయకులు రైతులకు సంబంధించిన రుణ మాఫీ సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ స్పందిస్తూ రుణమాఫీలో తలెత్తిన చిన్నపాటి లోపాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో బండి దత్తాత్రి, జగన్, రమేశ్, పోశెట్టి, నర్సింగ్‌రావు తదితరులున్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

న్యూస్‌రీల్

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా వాజీద్‌అలీ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా ఎండీ వాజీద్ అలీ నియామకం అయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఏఎస్‌వోగా పనిచేస్తున్న ఈయనను ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేసిన ప్రభుత్వం ఇన్‌చార్జి డీఎస్‌వోగా పూర్తి బాధ్యతలు అప్పగించింది. ఇక్కడ డీఎస్‌వోగా పనిచేస్తున్న టి.కిరణ్‌కుమార్‌ను నిర్మల్ జిల్లా డీఎస్‌వోగా బదిలీ చేసింది. కాగా కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న ఏఎస్‌వో పోస్టు ఎట్టకేలకు భర్తీ అయింది. ఆ స్థానంలో పెద్దపల్లి జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రవీందర్ రాథోడ్‌కు ఏఎస్‌వోగా పదోన్నతి కల్పిస్తూ జిల్లాకు బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర సివిల్ సప్లైకమిషనర్ డీఎస్ చౌహాన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సుధారాణికి జిల్లా మేనేజర్‌గా పదోన్నతి

జిల్లా పౌరసరఫరాల శాఖలో అసిస్టెంట్ మేనేజర్ (అకౌంట్స్)గా పనిచేస్తూ జిల్లా ఇన్‌చార్జి డీఎంగా విధులు నిర్వహిస్తున్న జె.సుధారాణికి జిల్లా మేనేజర్‌గా పదోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆ శాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులకు పదోన్నతులు కల్పించిన ప్రభుత్వం ఆమెను ఆదిలాబాద్ జిల్లా డీఎంగానే నియమించింది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో రవీందర్

ఇంద్రవెల్లి: కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలని డీఐఈవో రవీందర్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. హాజరు పట్టికలతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. విద్యార్థుల హాజరుశాతం పెరిగేలా చర్యలు చేపట్టాలని అధ్యాపకులకు సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివరాజ్, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

'ఇది రైతు ప్రభుత్వం'

తాంసి: రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు రైతు సంక్షేమం కోరే ప్రభుత్వమని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. భీంపూర్ మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశారని పేర్కొన్నారు. దీనిని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు రైతులను రెచ్చగొడుతూ రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. రుణమాఫీ అందని రైతులు తమ వివరాలను సంబంధిత మండల నోడల్ అధికారులకు అందజేయాలని సూచించారు. ఇందులో నాయకులు దాసరి రమేశ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

నేడు దిశ జిల్లాస్థాయి సమీక్ష సమావేశం

కైలాస్‌నగర్: జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా అమలు చేసే కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) జిల్లాస్థాయి సమీక్ష సమావేశాన్ని ఈ నెల 21న ఎంపీ గోడం నగేశ్, కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన నిర్వహించనున్నట్లు డీఆర్డీవో సాయన్న ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

23న జాతీయ అంతరిక్ష దినోత్సవం

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ అంతరిక్ష దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలల్లో, డైట్ కళాశాలలో ఈ నెల 22, 23 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. 'చంద్రుని తాకేటప్పుడు జీవితాలను తాకడ, భారతదేశ అంతరిక్ష పాగా, అంతరిక్ష సాంకేతికత, దాని అనువర్తనాలపై దేశంలోని యువతను నిమగ్నం చేయడం, ప్రేరేపించడం' థీమ్‌గా వేడుకలను నిర్వహించాలని ఆమె సూచించారు.

దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ రాజర్షి షా
- 'ఎల్‌ఆర్ఎస్' పై పలుశాఖల అధికారులతో సమీక్ష

కై లాస్‌నగర్: ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మూడు నెలల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకోసం నియమించిన రెవెన్యూ, నీటి పారుదల, మున్సిపల్ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ పకడ్బందీగా దరఖాస్తుల పరిశీలన చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్ పకడ్బందీగా అమలు చేయాలి

కేంద్ర ప్రభుత్వం ఆదిమ గిరిజనుల సంక్షేమం కోసం చేపట్టిన పీఎం జన్‌మన్ పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని ఆ శాఖ కేంద్ర అధికారులు ఆదేశించారు. కార్యక్రమ అమలుపై జిల్లా కలెక్టర్లు, గిరిజన సంక్షేమశాఖ అధికారులతో మంగళవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సెప్టెంబర్ మొదటి వారంలో నిర్వహించ తలపెట్టిన మెగా ఈవెంట్ ప్రాజెక్ట్ ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలో ఇళ్లు, రోడ్లు, విద్యుత్, సోలార్ విద్యుదీకరణ, పాఠశాలలు, మల్టీపర్పస్ కమ్యూనిటీ బిల్డింగ్స్ ఎన్ని ఉన్నాయి, అందులో ఎన్ని కొనసాగుతున్నాయి, ఇంకా ఎన్ని అవసరం అనే అంశాలపై అధికారులు ఆరా తీశారు. వాటి అమలుపై పలు సలహాలు, సూచనలు అందించారు. తగు వివరాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఇందులో కలెక్టర్ రాజర్షి షా, ట్రెయినీ కలెక్టర్ అభిఘ్యాన్ మాల్వీయా ఐటీడీఏ పీవీటీజీ ఏపీవో మనోహర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి 'పొంగులేటి'
- వర్షాల నేపథ్యంలో కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

కైలాస్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా అధికారులతో భారీ వర్షాలు, ధరణి, నూతన రెవెన్యూ చట్టంపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి తగు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. పాఠశాలల విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, స్థానిక పరిస్థితుల ఆధారంగా సెలవు ప్రకటించడం లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. కొత్త రెవెన్యూ చట్టంపై ఈనెల 23, 24 తేదీల్లో జిల్లా స్థాయిలో వర్క్‌షాప్ నిర్వహించి మేధావుల అభిప్రాయాలు తీసుకొని రాష్ట్రస్థాయికి పంపించాలన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఇందులో కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీకలెక్టర్ అభిఘ్యాన్ మాల్వియా, ఆర్డీవోలు వినోద్‌కుమార్, జీవాకర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ చౌహాన్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ పాల్గొన్నారు.

డెంగీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: డెంగీ నియంత్రణకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. పట్టణంలోని రాంనగర్‌లో సీజనల్ వ్యాధులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి వ్యాధుల ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డెంగీ నియంత్రణకు మున్సిపల్, మెప్మా సిబ్బందితో యాక్షన్ ప్లాన్ తయారు చేసినట్లు పేర్కొన్నారు. వారానికి రెండుసార్లు డ్రై డే పాటించాలన్నారు. అలాగే ఇంటి ఆవరణలో నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇందులో మలేరియా నియంత్రణ అధికారి శ్రీధర్, వైద్యారోగ్యశాఖ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు..

నార్నూర్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. హైరిస్క్ గ్రామాలపై దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు, సిబ్బంది తదితరులున్నారు.



మురుగుకాలువను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కొనసాగుతున్న జూడాల నిరసన

ఆదిలాబాద్‌టౌన్: కోల్‌కతా వైద్య విద్యార్థినిని దారుణంగా హతమార్చిన ఘటనను నిరసిస్తూ రిమ్స్ మెడికోలు, జూనియర్ డాక్టర్లు చేపడుతున్న నిరసనలు కొనసాగుతున్నాయి. మంగళవారం రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆవరణలో మహిళలను గౌరవించేలా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. జూడాల సంఘం అధ్యక్షుడు సందీప్‌చారి, జూనియర్ డాక్టర్లు కారుణ్య, మౌనిక, అన్వేశ్, రాజు, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న జూనియర్ డాక్టర్లు

క్లుప్తంగా

పత్తిచేను ధ్వంసం చేసిన వారిపై కేసు



పంటచేనులో ధ్వంసమైన మొక్కలు

తాంసి: మండలంలోని కప్పర్ల శివారులోని పత్తిచేను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివరాం తెలిపారు. కప్పర్ల గ్రామానికి చెందిన నర్సింహులు గ్రామశివారులోని మూడున్నరెకరాల్లో పత్తి సాగు చేశాడు. సోమవారం సాయంత్రం విఠల్, రజిత అనే దంపతులు కూలీలతో కలిసి ఈ చేనును ధ్వంసం చేయించారు. ఏపుగా పెరిగిన పత్తి మొక్కలను ధ్వంసం చేయడంతో రూ.70వేల వరకు నష్టం జరిగిందని బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నర్సింహులు ఫిర్యాదు మేరకు ఆదిలాబాద్‌కు చెందిన విఠల్, రజిత దంపతులతో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం



స్వప్నను కుటుంబీకులకు అప్పగిస్తున్న ఏఎస్సై

బాసర: బాసర గోదావరి నది వద్ద ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఏఎస్సై ఉజ్వల తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోటగల్లికి చెందిన స్వప్న మంగళవారం బాసర గోదావరి నది వద్దకు వచ్చి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన పోలీసులు ఆమెను కాపాడి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లగా ఏఎస్సై ఉజ్వల కౌన్సెలింగ్ నిర్వహించారు. కుటుంబ సభ్యులను పిలిపించి ఆమెను అప్పగించారు. కాగా, స్వప్న ఆత్మహత్యాయత్నానికి కుటుంబ సమస్యలే కారణమని తెలిసింది.

‘ఆరోపణల్లో నిజం లేదు’

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జాతీయ రహదారి 63అలైన్‌మెంటు మార్పులో తనకేం సంబంధం లేకున్నా కొందరు రాజకీయంగా దెబ్బతీసేందుకే అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయనపై వచ్చిన ఆరోపణలపై స్పందించారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పర్యటనలో ఎన్‌హెచ్–63 బాధితులు వినతులు ఇచ్చారని తెలిపారు. కొందరు తన ప్రమేయంతో గత అలైన్‌మెంటు మార్చినట్లు బాధితులను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తూ రాజకీయంగా ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. తాను భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మాజీ ఎంపీ వెంకటేష్ నేతతో కలిసి విన్నవించామని గుర్తు చేశారు. అంతేకాక ఆర్వోను కూడా కలిసి పలుమార్లు కోరినట్లు తెలిపారు. కానీ కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, ఇలాంటివి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ ఆరోపణలను ఖండిస్తున్నానని తెలిపారు.

ఆర్టీసీకి రాఖీ కళ

- ప్రయాణికులతో రద్దీగా బస్టాండ్లు
- సంస్థకు రికార్డుస్థాయి ఆదాయం
- పండుగ రోజే రూ.1.57 కోట్లు



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ఆదిలాబాద్ బస్టాండ్

ఆదిలాబాద్/ఆసిఫాబాద్‌అర్బన్: రాఖీ పండుగను పురస్కరించుకుని ఆర్టీసీకి రికార్డు స్థాయి ఆదాయం సమకూరింది. మంగళవారం రాఖీ పండుగ నేపథ్యంలో తమ సోదరులకు రాఖీ కట్టేందుకు మహిళలు పెద్ద ఎత్తున బస్సుల్లో రాకపోకలు సాగించారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ లాంటి నగరాల నుంచి ప్రయాణికులు ఎక్కువగా ఉంటారు. ఉమ్మడి జిల్లాకు ఆనుకుని ఉన్న నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో బంధుత్వాలు ఎక్కువగా ఉండడంతో ఆయా ప్రాంతాల నుంచి ఇక్కడికి, ఇక్కడి నుంచి ఆయా జిల్లాలకు ఎక్కువగా ప్రయాణాలు చేయడంతో బస్సులు ప్రయాణికులతో నిండిపోయాయి. బస్సులు బస్టాండ్లలోకి రాకముందే ప్రయాణికులు వాటి కోసం పరిగెత్తాల్సి వచ్చిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. లక్ష్యానికి మించి ప్రయాణికులు ప్రయాణించడంతో రికార్డుస్థాయిలో ఆదాయం సమకూరింది. గతేడాది రాఖీ పండుగ రోజు ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో మొత్తంగా రూ.1.12 కోట్ల ఆదాయం రాగా, ఈసారి రూ.1.87 కోట్లు రావడం విశేషం. గతేడాదితో పోల్చితే 60శాతం ఆదాయం అధికంగా వచ్చింది. మొత్తంగా 17, 18, 19 తేదీల్లో బస్సులు 7,86,275 కిలోమీటర్లు ప్రయాణించాయి.

మహాలక్ష్మిలకే పెద్దపీట

రాఖీ పండుగ కావడంతో ప్రయాణికుల్లో అత్యధికులు మహిళలే ఉన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో ఎంత దూరమైనా ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు రాష్ట్ర ప్రభుత్వం కల్పించడంతో సోదరులకు రాఖీలు కట్టడానికి మహిళలు దూర ప్రయాణమైనా ఆర్టీసీకే ప్రాధాన్యతనిచ్చారు. రీజియన్ పరిధిలో 17, 18, 19 తేదీల్లో 6,42,373 మంది ప్రయాణించగా, 3,69,763 మంది మాత్రమే టికెట్లకు డబ్బులు చెల్లించి ప్రయాణించారు. అంటే టికెట్ తీసుకున్న వారి కంటే మహాలక్ష్మి లబ్ధిదారులే రెట్టింపుగా ఉండడం గమనార్హం. అత్యధికంగా నిర్మల్ డిపో పరిధిలో 1,56,289 మంది మహాలక్ష్మి టికెట్‌పై ప్రయాణించారు. ఒక్క రాఖీ రోజే నిర్మల్ డిపో పరిధిలో 60 వేల మంది ప్రయాణించడం గమనించదగిన విషయం.

నిర్మల్, మంచిర్యాల పోటాపోటీ

ఆదాయం విషయంలో రీజియన్ పరిధిలో నిర్మల్, మంచిర్యాల డిపోలు పోటీపడ్డాయి. 17, 18,19 తేదీల్లో రూ.1.10 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకోగా, టార్గెట్‌ను అధిగమించి నిర్మల్ డిపో రూ.1.25 కోట్ల ఆదాయంతో మొదటి స్థానంలో నిలిచింది. ఇక మంచిర్యాల డిపో రూ.1.24 కోట్ల ఆదాయం సాధించింది. ఆదిలాబాద్ డిపో పరిధిలో రూ.1,00,80,479, ఆసిఫాబాద్ డిపో పరిధిలో రూ.74,98,361, భైంసా డిపో పరిధిలో రూ.52,05,368, ఉట్నూర్ డిపో పరిధిలో రూ.24,03,122 ఆదాయం సమకూరింది.

పకడ్బందీగా ముందుకెళ్తాం



గతంతో పోలిస్తే ఈసారి రాఖీ పండుగ సందర్భంగా భారీ రద్దీ కనిపించింది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రీజియన్ పరిధిలో అన్ని బస్సు సర్వీసులను నడిపాము. ముఖ్యంగా మా సిబ్బంది ఎంతో శ్రమించి ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్య స్థానాలకు చేర్చారు. రికార్డు స్థాయిలో ఈసారి ప్రయాణికులు ప్రయాణించడంతో చిన్నపాటి ఇబ్బంది తలెత్తినా, ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా డ్రైవర్లు, కండక్టర్లు ఎంతగానో కష్టపడ్డారు. ముమ్ముందు ఇలాగే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా మరింత పకడ్బందీగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తాం. అధిక ఆదాయాన్ని సమకూర్చిన కార్మికులకు అభినందనలు. ఇదే స్ఫూర్తితో మరింత బాధ్యతతో పనిచేయాలి.

– సోలోమన్, ఆర్టీసీ ఆర్ఎం, ఆదిలాబాద్

ఉపాధి కోసం వెళ్లి ఊపిరి తీసుకున్నాడు



సుధాకర్ (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఉపాధి కోసం బ్రహ్రెయిన్‌కు వెళ్లిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. భైంసా మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మెండోల్ల సుధాకర్ (40) ఆర్నెళ్ల క్రితం ఉపాధి కోసం ఓ ఏజెన్సీ సహాయంతో విజిట్ వీసాపై బ్రహ్రెయిన్‌కు వెళ్లాడు. అక్కడ సరైన పని దొరకక, చేసిన పనికి వేతనం రాక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈనెల 15న అక్కడ తాను ఉంటున్న గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసిన మృతుడి భార్య అనిత, ఇద్దరు కూతుర్లు, కొడుకు, ఇతర కుటుంబీకులు బోరున విలపించారు. ఇదివరకే ఓసారి సుధాకర్ విజిట్ వీసాపై విదేశాలకు వెళ్లి ఆర్థికంగా నష్టపోయాడు. కాగా, సుధాకర్ మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు. మంగళవారం తనను జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో కలిసిన సుధాకర్ భార్య అనిత, కుటుంబసభ్యులకు ఆయన భరోసా కల్పించారు. బ్రహ్రెయిన్ రాయబార కార్యాలయానికి ఇదివరకే సుధాకర్ వివరాలు మెయిల్ ద్వారా పంపినట్లు స్వదేశ్ వివరించారు. మృతదేహాన్ని ఇండియాకు పంపించేందుకు అక్కడి గల్ఫ్ కార్మిక సంఘం నాయకులు రాజేశ్వర్, అనిల్ తదితరుల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీ కేసులో మరో నిందితుడి అరెస్ట్



మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్, పక్కన సీఐ



స్వాధీనం చేసుకున్న నగదు, సామగ్రి

- రూ. 2లక్షలు స్వాధీనం

భైంసాటౌన్: గత జూన్‌లో పట్టణంలోని ద్వారకానగర్, నేతాజీనగర్‌లలోని రెండిళ్లలో చోరీలకు పాల్పడిన కేసులో మరో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్పీ అవినాష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. జూన్ 9న మహారాష్ట్రకు చెందిన కాతేకర్ రాజుతోపాటు మరో ఇద్దరు బైక్‌పై వచ్చి పట్టణంలోని పార్డి–బీ బైపాస్ రోడ్ సమీపంలోని ద్వారకానగర్‌కు చెందిన సుంకరి వినయ్‌కుమార్, నేతాజీనగర్‌కు చెందిన బాబోల్ల రమేశ్ ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ కేసులో ఇటీవల కాతేకర్ రాజును అరెస్ట్ చేయగా, మరో నిందితుడు రాజు లక్ష్మణ్ దోత్రేను అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ వెల్లడించారు. అతడి నుంచి ఒక బైక్, రూ.2.01లక్షల నగదు, మొబైల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగతనాలకు ఉపయోగించిన ఐరన్ రాడ్, సుత్తి, స్క్రూడ్రైవ్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. మరో నిందితుడినీ త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. కాగా, దోత్రే లక్ష్మణ్ పదేళ్లుగా తెలంగాణతోపాటు మహారాష్ట్రలోనూ ఫింగర్ ప్రింట్స్, చిరునామా వివరాలు లేకుండా తిరుగుతున్నాడని, ఇదివరకే పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పట్టణ సీఐ రాజారెడ్డి, ఎస్సై ఎండీ షరీఫ్, హెడ్ కానిస్టేబుల్ ఆనంద్, కానిస్టేబుళ్లు ప్రమోద్, గంగాధర్, భూషణ్, ప్రమోద్, బాలాజీని ఏఎస్పీ అభినందించారు.

యథేచ్ఛగా మొరం తవ్వకాలు



పొక్లెయిన్‌తో తవ్విన ప్రదేశం

దండేపల్లి: మండలంలోని గూడెం గుట్టల్లో మొరం తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. రాత్రి వేళ పొక్లెయిన్లతో తవ్వకాలు జరిపి మొరాన్ని టిప్పర్లలో తరలిస్తున్నారు. అధికారుల నిఘా లేక అక్రమ దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. దీంతో ఎత్తయిన గుట్టలు నేలమట్టమవుతున్నాయి. అధికారులు స్పందించి మొరం తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సంధ్యారాణిని సంప్రదించగా, గూడెం గుట్టల్లో మొరం తవ్వకాలకు ఎవరికి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. విషయాన్ని మైనింగ్ అధికారులకు తెలిపి పోలీసుల సహకారంతో మొరం తవ్వకాలకు అడ్డుకట్ట వేస్తామని చెప్పారు.

ఆఫీస్ స్టాఫ్ ఉద్యోగులకు ఎఫ్ఎస్వోగా కన్వర్షన్



సీసీఎఫ్‌వోకు మొక్క ఇస్తున్న శాంతారాం

మంచిర్యాలక్రైం: జిల్లా అటవీశాఖ కార్యాలయంలో పని చేస్తున్న నలుగురు జూనియర్ అసిస్టెంట్లకు ఫీల్డ్ స్టాఫ్‌గా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా కన్వర్షన్ చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాళేశ్వరం జోన్–2 చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) బీ ప్రభాకర్ తొలిసారి జిల్లా అటవీశాఖ కార్యాలయానికి మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సీఎఫ్‌వో శాంతారాం పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. నలుగురు ఉద్యోగులకు ఈ నెల 21న గాందారి వనంలో శారీరక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిసింది. కాగా, జిల్లా విభజన జరగక ముందు మంచిర్యాల ఎఫ్‌డీవోగా ప్రభాకర్ విధులు నిర్వహించారు. 2016లో జిల్లాల విభజన తర్వాత జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్‌వో) గా సుదీర్ఘకాలంగా పని చేశారు. అనంతరం ఆదిలాబాద్ సీఎఫ్‌వోగా ప్రమోషన్ పొంది ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లి అక్కడ సీఎఫ్‌వోగా పని చేశారు. మళ్లీ ప్రమోషన్ పొందుతూ కాళేశ్వరం జోన్–2 సీసీఎఫ్‌వోగా పని చేస్తున్నారు. కాగా, తొలిసారి మంచిర్యాలకు రావడంపై జిల్లా అటవీశాఖ అధికారులు ఘనస్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఆపదలో ఉన్న దంపతులకు ఆర్థికసాయం

సాక్షి ఎఫెక్ట్..



కిరణ్ దంపతులకు నగదు ఇస్తున్న సంతోష్‌కుమార్

చెన్నూర్: చెన్నూర్ పట్టణానికి చెందిన చకినారపు స్రవంతికి కేవలం 800 గ్రాములతో ఆడ శిశువు జన్మించింది. పాపను బతికించుకునేందుకు నిరుపేద కిరణ్, స్రవంతి దంపతులు ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్న విషయాన్ని గత మంగళవారం ‘నిరుపేదకు పెద్ద ఆపద’ శీర్షికన ‘సాక్షి’లో ప్రచురించిన కథనానికి దాతలు వివిధ రూపాల్లో స్పందించి తోచిన సాయం అందిస్తున్నారు. చెన్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు చెన్నూర్ గ్రేట్ గాయ్స్ అనే వాట్సప్ గ్రూప్ నిర్వహిస్తున్నారు. చెన్నూర్ గ్రేట్ గాయ్స్ ఆధ్వర్యంలో నాధంగారి సంతోష్‌కుమార్ మంగళవారం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో కిరణ్, స్రవంతి దంపతులకు రూ.13,001 ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్, స్రవంతి దంపతులు ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న ఒకరికి ఐదేళ్ల జైలు

ఆసిఫాబాద్: గంజాయి సాగు చేస్తున్న వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పు చెప్పారు. సీఐ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌కు చెందిన చునార్కర్ ముకుందరావు తన పంట చేనులో పత్తితో పాటు గంజాయి సాగు చేస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు తేదీ:11.10.2021న ఎస్సై భూమన్న తనిఖీ చేయగా సుమారు 50 గంజాయి చెట్లు లభ్యమయ్యాయి. దీంతో అప్పటి సీఐ అశోక్ ముకుందరావుపై కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీడీవో, హెడ్ కానిస్టేబుల్ బాబురావు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. పీపీ జగన్మోహన్‌రావు వాదించారు.

అదృశ్యమై.. శవమై కనిపించాడు

ఆదిలాబాద్‌టౌన్: అదృశ్యమైన వ్యక్తి శవమై కనిపించాడు. వివరాలు.. ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడకాలనీకి చెందిన అడెపు శంకర్ (44) కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఏ పనీ చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. దీంతో అతడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లిన శంకర్ తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని ధనలక్ష్మి లాడ్జి ఎదుట గల రైల్వేట్రాక్ పక్కన చెట్లపొదల్లో శంకర్ శవాన్ని అటుగా వెళ్లిన వారు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారమందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న టూటౌన్ పోలీసులు కుళ్లినస్థితిలో ఉన్న మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్ మార్చురీకి తరలించారు. మిస్సింగ్ కేసు నమోదు కాగా, వారి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. వారు మార్చురీకి చేరుకుని మృతదేహం శంకర్‌దిగా గుర్తించారు. అనుమానాస్పదంగా మృతి చెందినట్లు వారు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

ఒకరి అదృశ్యం



రూబెన్ (ఫైల్)

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన రూబెన్ అదృశ్యమైనట్లు ఎస్సై సుమలత తెలిపారు. ఆదివారం బయటకు వెళ్లి వస్తానని వెళ్లిన అతడు రాత్రి వరకూ ఇంటికి రాలేదు. దీంతో అతడి భార్య మంజుల మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమలత తెలిపారు.

కుక్కల దాడిలో ఆరుగురికి గాయాలు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగిడి ఆర్ఆర్‌నగర్, చైతన్యనగర్‌లో మంగళవారం వీధి కుక్కలు స్వైరవిహారం చేశారు. ఈ కాలనీల్లో ఆరుగురిపై దాడి చేసి గాయపరిచాయి. మున్సిపాలిటీ పరిధిలో కుక్కల దాడులు వరుసగా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు. నామమాత్రపు చర్యలతో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు.

‘హాస్టల్ సిబ్బంది తప్పేమిలేదు’



విద్యార్థినుల తండ్రి ప్రవీణ్

రామకృష్ణాపూర్: రాఖీ పండుగ సందర్భంగా రామకృష్ణాపూర్ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల సిబ్బంది తప్పుగా వ్యవహరించలేదని విద్యార్థినులు దాసరి సహస్ర, అశ్విక తండ్రి ప్రవీణ్‌కుమార్ తెలిపాడు. సోమవారం రాఖీ పండుగకు తన కుమారుడు జితేంద్రకు కూతుళ్లిద్దరితో రాఖీ కట్టిద్దామని హాస్టల్ వద్దకు వెళ్లగా జనం ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నాడు. దీంతో తానే తన కుమారుడిని భుజాన ఎత్తుకుని కిటికీలో నుంచి తన కూతుళ్లతో రాఖీ కట్టించానని మంగళవారం విడుదల చేసిన ఓ వీడియోలో తెలిపాడు. తన సోదరుడికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో త్వరగా వెళ్లాలన్న ఉద్దేశంతో కిటికి దగ్గరికి వెళ్లి రాఖీ కట్టించానని పేర్కొన్నాడు. రాఖీ కట్టిన వీడియో తీసుకుని వాట్సప్ స్టేటస్‌గా పెట్టుకుంటే ఎవరో కావాలని వైరల్ చేశారని పేర్కొన్నాడు. ఈ విషయంలో హాస్టల్ సిబ్బంది తప్పేమీ లేదని వివరించాడు.

ఎస్‌బీఐ ఖాతాల్లోని నగదు మాయం

- ఖాతాదారుల ప్రమేయం లేకుండానే..
- రూ.52,250 నగదు ఖాళీపై ఫిర్యాదు
- బ్యాంక్ సిబ్బందిని నిలదీసిన వైనం
- తిరిగి నగదు జమ జేసిన సిబ్బంది



మేనేజర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు శ్రీనివాస్

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధి నడింపల్లె గ్రామానికి చెందిన గోస్కుల శ్రీనివాస్, ఉమ దంపతుల బ్యాంక్ ఖాతాల నుంచి వారి ప్రమేయం లేకుండానే నగదు ఖాళీ అయ్యింది. బాధితులు మంగళవారం బ్యాంక్ మేనేజర్ హృషికేశ్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుడు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల వ్యవసాయ భూమిపై పంటరుణం కావాలని శ్రీనివాస్ ఖానాపూర్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో సంప్రదించాడు. బ్యాంక్‌లో ఎఫ్‌వోఈగా పనిచేసే బెల్లాల రాజు ఇన్సూరెన్స్ ఏజెంట్‌తో సోమవారం సాయంత్రం 7.30 సమయంలో తన ఇంటికి వచ్చి ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ చేయాలని శ్రీనివాస్‌ను అడిగారు. దీంతో శ్రీనివాస్ తాను మేనేజర్‌తో ఇన్సూరెన్స్ వివరాలు తెలుసుకున్నాకే చేసే విషయమై ఆలోచిస్తామని తెలిపాడు. ఈ క్రమంలో రాజు, ఇన్సూరెన్స్ ఏజెంట్ శ్రీనివాస్ నుంచి ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకుని వెళ్లిన కాసేపటికే శ్రీనివాస్ భార్య ఉమ ఖాతా నుంచి రూ.52,250 శ్రీనివాస్‌కు ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. అనంతరం శ్రీనివాస్ ఖాతా నుంచి గుర్తుతెలియని వేరే వారి ఖాతాకు ఈ మొత్తాన్ని బదిలీ చేశారు. బ్యాంక్ ఖాతా నుంచి నగదు పోయినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావడంతో వెంటనే శ్రీనివాస్ సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడు. ఆధార్ కార్డు తీసుకున్న వారిని నిలదీయగా వెంటనే శ్రీనివాస్ ఖాతాకు తిరిగి రూ.52,250 జమచేశారు. కాగా, తమ ప్రమేయం లేకుండా తమ ఖాతాల నుంచి డబ్బులు ఎలా తీశారో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బ్యాంక్ మేనేజర్‌ను శ్రీనివాస్ కోరారు. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్‌ను సాక్షి వివరణ కోరగా, సోమవారం తాను సెలవులో ఉన్నానని తెలిపారు. ఖాతాదారుల అకౌంట్ల నుంచి నగదు పోయిన విషయమై బ్యాంక్‌లో ఎఫ్‌వోఈగా పనిచేసే రాజుతో పాటు ఇతరుల పాత్రపై బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

విద్యార్థుల ఆరోగ్యాన్ని గమనించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న మెస్రం ఛాయ

నేరడిగొండ: విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించాలని జీసీడీవో మెస్రం ఛాయ సూచించారు. మంగళవారం మండలంలోని లఖంపూర్, కుంటాలలోగల గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించారు. కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆరోగ్య రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో వైద్యశిబిరాలు నిర్వహించగా పలువురికి మాత్రలు పంపిణీ చేశారు. ఆమె వెంట ఎంపీవో లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు అశోక్‌రావు, అంబరావు, పంచాయతీ కార్యదర్శి రవికిరణ్ తదితరులున్నారు.

బీసీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

మంచిర్యాలటౌన్: వెనుకబడిన తరగతుల నిరుద్యోగ అభ్యర్థులకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి బీ వినోద్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్‌జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ, ఈసీఐఎల్, కుషాయిగూడ, హైదరాబాద్ సౌజన్యంతో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణలో 90 శాతానికి పైగా హాజరు నమోదైన అభ్యర్థికి నెలకు రూ.4వేల చొప్పున, మూడు నెలల పాటు భోజనం, స్టడీ మెటీరియల్, బేసిక్ టూల్ కిట్, బ్యాగ్, టీషర్టులను అందించనున్నట్లు తెలిపారు. 10వ తరగతి/ఐటీఐ/డిప్లొమా/ఒకేషనల్‌లో ఉత్తీర్ణత కలిగిన విద్యార్హతతో 18–25 సంవత్సరాలు వయస్సున్నవారు రూ.5లక్షలకు మించకుండా కుటుంబ వార్షికాదాయం కలిగి ఉండాలని పేర్కొన్నారు. 10వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని తెలిపారు. రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్, డిష్ వాషర్, ఎయిర్ కండీషనర్ రిపేర్, ఇన్‌స్టాలేషన్, గ్యాస్ చార్జింగ్, ఎల్‌టీవీ, ఓఎల్‌ఈడీ మానిటర్, మైక్రోవేవ్ ఓవెన్, వాటర్ ప్యూరిఫయర్, బేసిక్ హెచ్‌ఆర్ రిపేర్–ఇన్‌స్టాలేషన్ కోర్సులలో ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో www. tgbcstudycircle. cgg. gov. in లో ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కోర్సు పూర్తి చేసిన వారికి ధ్రువపత్రంతోపాటు ప్లేస్‌మెంట్ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డాక్టరేట్ పొందడం అభినందనీయం



ప్రకాశంను సత్కరిస్తున్న కుమార్‌దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా వయోజన విద్యాశాఖ పరిధిలోని పీఆర్పీ రెడ్డిమల్ల ప్రకాశం సమాజసేవలో డాక్టరేట్ పొందడం అభినందనీయమని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. సమాజ సేవలో నిమగ్నమై, సమాజ హితం కోరుతూ అందించిన సేవలకు గాను మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డు సంస్థ ద్వారా దేశ రాజధాని ఢిల్లీలో డాక్టరేట్ పొందిన రెడ్డిమల్ల ప్రకాశంను మంగళవారం కలెక్టర్ తన చాంబర్‌లో శాలువాతో సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాలుగా సమాజ హితం కోసం న్యాయవాద వృత్తిని చేపట్టి వయోజన విద్యలో విశిష్ట సేవలు అందించి డాక్టరేట్ పొందడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. భవిష్యత్‌లో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకుడు పోటు రవీందర్‌రెడ్డి, జిల్లా యువజన, క్రీడాధికారి కీర్తి రాజీవీర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, సఖీ లయన్స్ అధ్యక్షుడు బండ శాంకరి, డీఆర్పీ పోకల వెంకటేశ్వర్లు, సమన్వయకర్తలు గుండా సంధ్య, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేకి రాఖీ కట్టిన సోదరీమణులు



రాఖీ కడుతున్న రమ, వనిత

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు ఆయన సోదరీమణులు రమ, వనిత లు మంగళవారం రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆయన ఆదిలాబాద్‌లో అందుబాటులో లేకపోవడంతో రాఖీ కట్టలేక పోయారు.

గురుకులంలో రక్షాబంధన్



రాఖీలు కడుతున్న విద్యార్థినులు

బోథ్: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం రక్షాబంధన్ నిర్వహించారు. విద్యార్థినులు తోటి విద్యార్థినులకు రాఖీలు కట్టారు. 635 రాఖీలను స్థానిక జర్నలిస్టు నవీన్ అందజే శారు. వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



అన్నం పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి మనోహర్‌రావు

బేల: మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాలను మం డల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్‌రావు మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ల తోపాటు సరుకుల నిల్వలు, వంట గదిని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితుల పై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఎపడామిక్ సీజన్ దృష్ట్యా విద్యా ర్థుల ఆరోగ్య పరిస్థితులపై జాగ్రత్తలు తీసు కోవాలని ప్రిన్సిపాల్ రంగన్నకు సూచించారు. ఎంపీడీవో మహేందర్‌కుమార్ ఉన్నారు.

ఘనంగా కుంకుమార్చన



కుంకుమార్చనలో మహిళలు

ఆదిలాబాద్: శ్రావణమాసం పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో కుంకుమార్చన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రవీంద్రనగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ మహిళలు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఎంఈవోను కలిసిన రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: 19 ఏళ్ల అనంతరం ఆ దిలాబాద్‌కు బదిలీపై వచ్చిన ఎంఈవో డి.సోమయ్యను రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు మంగళవారం శాలువా కప్పి సన్మానించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు రాంచందర్ మహా త్యే, నూటెంకి సత్యనారాయణ, కృషిమిత్ర రక్త దాన సంస్థ అధిపతి ఠాకూర్ రాణాప్రతాప్ సిం గ్, ఉపాధ్యాయులు రమేశ్‌బాబు, ప్రకాశ్, సిబ్బంది సోహెల్ ఉన్నారు.

'బీఆర్‌ఎస్‌కు నైతిక హక్కు లేదు'

ఆదిలాబాద్‌రూరల్: రైతుల చేతులకు బేడీలు వేసి జైల్లో పెట్టిన బీఆర్‌ఎస్.. అన్నదాత సంక్షే మంపై మాట్లాడే నైతిక హక్కు లేదని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ పేర్కొన్నారు. మావల మండ లంలోని వాఘాపూర్ శివారులోని పంట పొలాలను మంగళవారం ఆయన సందర్శిం చారు. రుణమాఫీ అంశంపై పలువురు రైతుల తో మాట్లాడారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కానివారి కోసం ప్రభుత్వం మండ లాల వారీగా ఒక నోడల్ అధికారిని నియమిం చిందన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల మాయమాటలను రైతులు నమ్మొద్దన్నారు.

విరాళాల సేకరణ

ఎదులాపురం: కేరళలోని వయనాడ్ వరద బా ధితుల సహాయార్థం విరాళాలు అందించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేం ద్రంలోని యూనియన్ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. భుక్తాపూర్‌లోని యూనియ న్ కార్యాలయం నుంచి ప్రారంభించి పుర వీధుల గుండా తిరుగుతూ విరాళాలు సేకరిం చారు. రాజు, భాస్కర్, తబ్రేజ్‌ఖాన్, ముజీబ్, అశోక్, అప్రోజ్, వాహిద్ పాల్గొన్నారు.

పత్తికి తెగులు



తాంసి శివారులో వర్షాలతో ఎదుగని పత్తి

- చేలల్లో నిలుస్తున్న వర్షపునీరు
- పంట ఎదుగుదలపై ప్రభావం
- ఆందోళనలో రైతులు

తాంసి: వానాకాలం సీజన్‌లో రైతులు పత్తి సాగుచే శారు. తొలకరి జల్లులకు అంతర పంటలు వేశారు. నెలరోజులుగా కురుస్తున్న వర్షాలకు చేలల్లో నీరు నిలుస్తోంది. లోతట్టు ప్రాంతాలతోపాటు నల్లరేగడి భూములు ఊటపడుతున్నాయి. తెగులు సోకడం, పంట ఎదుగుదలపై ప్రభావం చూపుతోంది. దీం తో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేలల్లో ఏపు గా పెరిగిన కలుపు మొక్కలు తొలగించాలన్నా అక్కడికి వెళ్లలేని పరిస్థితి. వర్షాలు తగ్గితే గుంటుక తో కలుపుతీస్తే పిచికారీ చేసే అవకాశం ఉంది.



పంటచేనులో వర్షపు నీరు

ఉమ్మడి మండల వ్యాప్తంగా..

తాంసి, భీంపూర్ ఉమ్మడి మండల వ్యాప్తంగా రైతు లు ఈ సీజన్‌లో 32 వేల ఎకరాల్లో పత్తి సాగు చేసి నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. తాంసి, కప్పర్ల, వడ్డాడి, పొన్నారి, హస్నా పూర్, గోట్కూరి, సావర్గాం, గిరిగాం గ్రామాల్లో వర్షాల కారణంగా పత్తికి తెగుళ్ల వ్యాప్తి అధికంగా ఉంది. పంట ఎదుగుదల లేక కాండం ఎర్రబాడటం , ఆకులు రాలి చీడపీడలు ఆశిస్తున్నాయి. ఎడతెరిపి వానలతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలు తగ్గితే..

కురిసిన వర్షాలకు పంట దెబ్బతినడంతో పెట్టుబడి పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఎకరాకు విత్తనాలు, ఎరువుల కోసం రూ.15 వేలు పెట్టుబడి పెట్టారు. వారం రోజులు వర్షాలు లేకపోతే ఊటపట్టిన భూముల్లో తేమశాతం తగ్గి పనులు కొనసాగించే పరిస్థితి ఉంది. ఆగస్టులో ఎదగాల్సిన పంట ఎదగకపోవడం వల్ల పంట ఎదు గుతుందో లేదోనని రైతులు ఆందోళనకు గురవు తున్నారు.

చేలల్లో వర్షపు నీరు



పత్తి చేలల్లో వర్షం నీరు నిలుస్తుంది. పంటకు తెగుళ్ల సోకి ఆకులు ఎర్రగా మారి రాలిపోతున్నాయి. చేను బుర దగా మారడంతో గడ్డి ఏపుగా పెరిగింది. వర్షాలు ఇలాగే కురిస్తే పంటలు దెబ్బతినే అవకాశం ఉంది.

– ఇప్ప విఠల్, రైతు, తాంసి

వర్షపునీరు తొలగించాలి

పంటచేలలో వర్షపు నీరు రైతులు కాలువ ద్వారా తొలగించుకోవాలి. లేకపోతే మొక్క వేరు నుంచి ఎండిపోయే అవకాశం ఉంది. మొక్కలు ఎదిగేందుకు పిచ్చిమొక్కలు తొల గించి పోషకాలను డ్రించింగ్ ద్వారా అందిం చాలి. యూరియా, డీఏపీ ఎరువులు వేస్తే త్వరగా ఎదుగుతుంది.

– రవీందర్, ఏవో, తాంసి

రుణమాఫీ చేయాలని నిరసన



తాంసిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

తాంసి: రైతులకు రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూమండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నేతలు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సం దర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఏవో రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి రమణ మాట్లా డుతూ రుణమాఫీ చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలో రాగానే రైతులను మోసగించిందన్నారు. రుణమాఫీ కోసం రోడ్డె క్కిన రైతులపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కృష్ణ, వినోద్‌రెడ్డి, అనీష్, అశోక్, రఘు, శంకర్, ఆశన్న తదితరులు ఉన్నారు.

'రైతులపై కేసులు హేయమైన చర్య'

బోథ్: రుణమాఫీ కాలేదని నిరసన వ్యక్తం చేసిన తలమడుగు మండల రైతులపై ప్రభుత్వం కేసు లు పెట్టడం హేయమైన చర్యని బీఆర్‌ఎస్ రైతు విభాగం మండల అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

'కేసులు ఉపసంహరించుకోవాలి'

సిరికొండ: రుణమాఫీ కోసం ఆందోళన చేసిన రైతులపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఉప సంహరించుకోవాలని బీఆర్‌ఎస్ నేతలు డిమాం డ్ చేశారు. రైతులకు వెంటనే రుణమాఫీ చేయా లని మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. నాయకులు పెంటన్న, సూర్యకాంత్, తోకల చిన్న రాజన్న, గోర్ల రాజన్న, లతీఫ్, చెండే బాలాజీ, రోహిదాస్, సునీల్, రైతులు విఠల్, బాలాజీ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక భావనతో మెలగాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావనతో మెలగాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని నారాయణపూర్ గ్రామంలో హను మాన్ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనిల్ జాదవ్ గెలిచాక బీఆర్‌ఎస్ కార్యకర్త సాబ్లే హుషార్ సింగ్ అన్నదాన కార్యక్రమం తోపాటు పూజలు చేస్తానని మొక్కుకున్నారు. ఇం దులో భాగంగా పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానిం చారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్, బీఆర్‌ఎస్ నాయకు లు ప్రతాప్ సింగ్, గులాబ్ సింగ్, జాదవ్ గణేశ్, పచ్చు సింగ్, మేర్ సింగ్, బర్దావల్ శ్రీనివాస్ తదిత రులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

ఎదులాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జగన్‌సింగ్ డిమాండ్ చేశారు. జిల్లా కేం ద్రంలోని కుమురం భీం భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డారు. అర్హులందరికీ రేషన్‌కార్డు, ఇంటి స్థలం, పిం ఛన్లు, నిరుద్యోగ భృతి, పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్, నిరుద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌తో ఈనెల 22న హైదరాబాద్‌లోని ఇం దిరా పార్కు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలు, యువత, మేధావులు, విద్యార్థులు, ప్రజలు ఈ ధర్నాలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో అశోక్, సురేశ్, సాయికుమా ర్, బుచ్చిరాం, విలాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వసతిగృహాల్లో స్వచ్ఛత పాటించాలి

ఇంద్రవెల్లి: వసతిగృహాల్లో స్వచ్ఛత పాటించాలని డీఆర్‌డీవో సాయన్న పేర్కొన్నారు. మండలకేంద్రం లోని ఎస్సీ వసతి గృహంతోపాటు హీరాపూర్ గ్రామంలో కేజీబీవీ వసతి గృహాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల రిజిస్టర్, రికార్డులతోపాటు స్టోర్ రూమ్‌లో బియ్యం, గుడ్లు, పండ్లు, కూరగాయ లను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఎంపీ డీవో భాస్కర్‌రావ్, ఎంపీవో సుమీర్‌హైమద్, ఈవో సంజీవ్‌రావ్ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ

జైనథ్: హాస్టళ్లు, పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్ర తపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని ఎంపీడీవో రవీంద్రనాథ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ విద్యాలయాలను మంగళ వారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులతో కలిసి పాఠశాల పరిసరాలు పరిశీలిం చారు. దోమల నివారణకు పంచాయతీ కార్మికుల తో పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూ డాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి ఫీవర్ సర్వేలో పాల్గొన్నారు. కార్యదర్శి ముజీబ్ ఉన్నారు.

'కార్యదర్శిని విధుల్లోకి తీసుకోవాలి'

నేరడిగొండ: నార్నూర్ మండలంలోని పంచాయతీ కార్యదర్శిపై అకారణంగా సస్పెన్షన్‌ను ఎత్తివేసి వెం టనే విధుల్లోకి తీసుకోవాలని పంచాయతీ కార్యద ర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు అరుణ్‌రెడ్డి డిమాం డ్ చేశారు. మండల కార్యదర్శులతో కలిసి ఎంపీవో లక్ష్మణ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యదర్శులు అనూష, జ్యోతి, పవన్, శ్రీకాంత్, రవికిరణ్, చందు, నవీన్ తదితరులు ఉన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు

ఇచ్చోడ: ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ భీమేశ్ హెచ్చరించారు. తన కార్యాల యంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని పేర్కొన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బం ది కలిగించినా, రాస్తారోకో చేసేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం పోస్టు చేసినా, రైతులను యువకులను తప్పుదోవ పట్టిస్తే వారిపై చట్టారీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని టీచర్స్ కాలనీలో శ్రీ రేణుకా బాలాజీ అపార్ట్‌మెంట్‌లోని శ్రీ వినాయక ఆలయం 5వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వ హించారు. పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకుడు లోక ప్రవీణ్‌రెడ్డి–శైలజ దంపతులు, ఆలయ ప్రధాన కార్యదర్శి సందీప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రకాశ్‌రావు, సభ్యులు వినోద్, ప్రసాద్‌రెడ్డి, మానిష్‌రెడ్డి తదిత రులు ఉన్నారు.

నేడు డీఈవో కార్యాలయ ముట్టడి

ఎదులాపురం: ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అను బంధ) బుధవారం డీఈవో కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చినట్లు రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పలు పాఠ శాల్లో మంగళవారం కార్మికులతో ఆయన సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ముట్టడికి జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులు, వర్కర్లు తరలిరావాలని కోరారు.

పద్మశాలి విజయోత్సవ సంబరాలు

ఆదిలాబాద్‌రూరల్: పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్య క్షుడు వాళ్లకాటి రాజ్‌కుమార్ ఎన్నికైన సందర్భంగా జిల్లా కేంద్రంలోని కొండ లక్ష్మణ్ బాపూజీ చౌక్‌లో సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, నాయకులు దత్తు, అనుముల ఊషన్న, కుర్ర నరేశ్, కొక్కుల అడేళ్లు, కాసర్ల శ్రీనివాస్, రమేశ్, సునీల్ పాల్గొన్నారు.

22న ఇసుక డంప్ వేలం

జైనథ్: మండల కేంద్రంలో ఈనెల 22న ఇసుక డం ప్ వేలం వేయనున్నట్లు తహసీల్దార్ శ్యాంసుందర్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు గురువారం ఉదయం 11 నుంచి 1గంట వరకు నిర్వహించే వేలంలో పా ల్గొనాలని కోరారు. వేలంలో ఇసుక దక్కించుకున్న వ్యక్తి మూడు రోజుల్లో డబ్బులు జమచేయాల్సి ఉం టుందని పేర్కొన్నారు. అలా జమ చేయకపోతే వేలం రద్దు చేసి, తిరిగి వేలం నిర్వహిస్తామని తెలిపారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



బేల: నివాళులర్పిస్తున్న మాజీ జెడ్పీటీసీ, నాయకులు



కైలాస్‌నగర్: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

- నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 80వ జయంతిని జిల్లావ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్ లో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో సాంకేతిక రం గాన్ని అభివృద్ధి చేసిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కిందన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్ , నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి, జహీర్ రంజానీ, సాయి చరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- దేశ సాంకేతిక పరిజ్ఞానానికి నాంది పలికిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని తెలం గాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. కిసాన్ కాంగ్రె స్ ఆధ్వర్యంలో కేఆర్కే కాలనీలోని వృద్ధాశ్రమం లో ఆయన జయంతిని నిర్వహించారు. అనం తరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. మావల మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ మెంబర్ రహీం ఖాన్, యువ జన జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, మావల మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సురేశ్, నాయకులు నవీన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, ప్రభాక ర్, షాహిద్, రంజిత్‌రెడ్డి, సంటెన్న పాల్గొన్నారు.

బేల: మండలకేంద్రంలోని కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, పార్టీ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, నాయకులు సామ రూపే ష్‌రెడ్డి, వాంఖడే వామన్, దేవ్‌తాళే విఠల్, గావుండే ఘణేశ్యాం, బొక్రే శంకర్, గుండవార్ సంజయ్, మడావి చంద్రకాంత్, గొడే అవినాష్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖయ్యూం, నాయకులు దూట రాజేశ్వర్, కలీం, సుశీల్, యూసుఫ్, రాజేశ్ తదితరులు పాల్గొ న్నారు. హస్నాపూర్‌లో జరిగిన వేడుకల్లో జిల్లా మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ షేక్ జావిద్, మాజీ బ్లాక్ అధ్యక్షుడు మదన్‌రావు, అశోక్, గ్రామ అధ్యక్షుడు జావిద్, కిరణ్, విష్ణు, చందు, అఖిల్, జుబేర్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద రాజీవ్ గాంధీ జయంతిని నిర్వహించారు. కాంగ్రెస్ మం డల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, నాయకులు మీర్జా యాకుబ్‌బేగ్, సోమోరే నాగోరావ్, సోమోసే వెంక ట్‌రావ్, జెల్పేట్ మారుతి, ఎండీ జున్నైద్, జహీర్, జితేందర్ తదితరులు ఉన్నారు.

బోథ్: స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవర ణలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రప టానికి పూలమాలలు వేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు గొర్ల రాజుయాదవ్, చట్ల ఉమేశ్, నారాయణ, మహ మ్మద్, అబ్రార్, అబూద్, లింబాజీ, యూసుఫ్, సురేందర్, నహీమొద్దీన్, షాకీర్, భోజన్న, శేఖర్, అరుణ్, హసీబ్, జునెద్ పాల్గొన్నారు.



బోథ్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఇంద్రవెల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు



ఉట్నూర్‌రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు



హస్నాపూర్‌లో..

సంక్షిప్త వార్తలు

కొనసాగిన శబరిమాత అఖండ జ్యోతి

తలమడుగు: మండలంలోని అర్లి(కే) గ్రామంలో శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమం కొనసాగిం ది. మంగళవారం నాటికి 15వ రోజు చేరింది. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి శబరిమాత ఆలయంలో పూజలు చేశారు. అనం తరం ఆయన భక్తులకు అన్నదానం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ రమేశ్ రెడ్డి, గ్రామస్తులు, వాగాపూర్ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరణ

బోథ్: రుణమాఫీ కాని రైతుల నుంచి వ్యవసాయా ధికారులు మంగళవారం రైతు వేదికల్లో దరఖాస్తు లు స్వీకరించారు. మండలంలో ఇప్పటివరకు 70 దరఖాస్తులు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు.

కస్తూర్బా పాఠశాల పరిశీలన

సిరికొండ: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను డీఎల్‌పీవో ఫణిందర్ మంగళవారం పరిశీలించారు. తరగతి, వంట గదులు, మరుగు దొడ్డిని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

బోథ్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉం డాలని ఎస్సై ప్రవీణ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ యువకులు భవిష్యత్తుపై దృ ష్టి పెట్టాలన్నారు. గంజాయికి బానిస కావొద్ద న్నారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు.

సన్మానం

బజార్‌హత్నూర్: స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్ రిటైర్డ్ ఉద్యోగి మహ్మద్ షఫీ మంగళవారం జెడ్పీ సెకండరీ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం ఆర్వో ఆర్ మినరల్ వాటర్ మిషన్, సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించేందుకు మంగళవారం స్టేజ్, టీన్ షెడ్డును ఏర్పాటు చేయించారు. రూ.70 వేలతో వీటిని ఏర్పాటు చేయించిన మహ్మద్ షఫీని హెచ్ ఎం నరేశ్, ఉపాధ్యాయులు సన్మానించారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు

బజార్‌హత్నూర్: స్థానిక మహదేవుని మందిరం అభివృద్ధికి రాజుగౌడ్(లోకేశ్వరం మండలం) రూ.50 వేలు, పోలావార్ ప్రమోద్ కుమార్ రూ.16 వేలు, దామోదర్(దిలావర్‌పూర్ మండలం) రూ.15 వేలు, గుర్ల శ్రీనివాస్ యాదవ్ రూ.5వేల నగదును విరాళంగా అందజేశారు. ఆలయకమిటీ సభ్యులు పోలోజు రాజన్న, దుబ్బుల ముత్తన్న, కొత్త గంగయ్య, బొమ్మెడి శంకర్, జడల శ్రీనివాస్, గణేశ్ మంగళవారం దాతలను సన్మానించారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం

నార్నూర్: పరిసరాల శుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని ఎంపీ డీవో జవహర్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో మండల కేంద్రంతోపాటు తాడిహ త్నూర్ గ్రామంలో మంగళవారం రాఫిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ రోగుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎం పీడీవో మాట్లాడుతూ ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఎంపీవో స్వప్నశీల, స్వప్న, శీలా, ఆశకార్యకర్త జ్యోతి, వైద్య, ఐసీడీఎస్, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పట్టా పాస్‌బుక్‌లు ఇప్పించాలి

నేరడిగొండ: పీఏసీఎస్ కార్యాలయంలో రుణాలు పొందిన తమకు పట్టాపాస్ బుక్‌లు ఇప్పించాలని రైతులు కోరుతున్నారు. గ్రామాల రైతులు రుణాలను పీఏసీఎస్‌లో పొందగా, వారి వద్ద ఉన్న పట్టా పాస్‌బుక్‌లను కార్యాలయంలో ఉంచుకోవడంతో అవసరం నిమిత్తం వెళ్లినా ఇవ్వడం లేదని వాపోతున్నారు.